సాక్షి
కాకినాడ
సోమవారం । 17 । జూలై । 2023



రూ.లక్ష విరాళం
కొత్తపేట: మందపల్లి ఉమా మందేశ్వర స్వామి వారి అన్నప్రసాద ట్రస్ట్‌కు వి.సీతారామాంజనేయప్రసాద్, లక్ష్మీరాజ్యం దంపతుల కుమారుడు సాయిసమీర్ (తుని) రూ.1,00,050 విరాళం సమర్పించారు.



భావి పారిశ్రామికవేత్తల కోసం..
విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నుంచి 9వ తరగతి విద్యార్థులకు 'పారిశ్రామిక మనస్తత్వ అభివృద్ధి' కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. - 8లో

డెల్టాలకు 10,400 క్యూసెక్కులు


ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టాలకు ఆదివారం 10,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు 3,800, సెంట్రల్ 2,600, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. సముద్రంలోకి 1,25,693 క్యూసెక్కుల మిగులు జలాలను విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.70 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

మరిడమ్మ సన్నిధికి పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ అమ్మవారు

పెద్దాపురం: ఆషాఢ మాసం ఉత్సవాల్లో భాగంగా ఆఖరి ఆదివారం మరిడమ్మ వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సుమారు లక్ష మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు అంచనా వేశారు. వేకువ నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. క్యూలో నాలుగు గంటల పాటు వేచి ఉండి మరీ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్.రామ్మోహనరావు ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు. తాత్కాలిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన జాతర ఘనంగా నిర్వహించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పెద్దాపురం బ్రాహ్మణ సేవా సంఘం, సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన భక్తులకు ఉచితంగా పులిహోర పంపిణీ చేశారు.

ఏలేరు ఆయకట్టుకు 700 క్యూసెక్కులు
ఏలేశ్వరం: ఏలేరు రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతోపాటు విశాఖపట్నానికి 200, తిమ్మరాజు చెరువుకు 50 క్యూసెక్కుల చొప్పున వదులుతున్నారు. జలాశయం గరిష్ఠ నీటి మట్టం 86.56 మీటర్లు కాగా, ఆదివారం 75.05 మీటర్లుగా నమోదైంది. రిజర్వాయర్ సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా 8.36 టీఎంసీల మేర నీటి నిల్వలున్నాయి.

నరసన్న సన్నిధిలో ఏపీ హైకోర్టు జడ్జి


హైకోర్టు జడ్జి మానవేంద్రనాథ్‌రాయ్‌కు వాడపల్లి వెంకన్న చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహ స్వామి వారికి ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు పలికారు. స్వామి వారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్‌కు అందజేశారు. ఆయన వెంట రాజోలు సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు ఉన్నారు.

వాడపల్లి వెంకన్న సన్నిధిలో..

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి చిత్రపటం అందజేశారు.

ఆపుకోలేక.. చెప్పుకోలేక..

- పెద్దల్లో పెరుగుతున్న మూత్ర సంబంధ సమస్యలు
- ప్రతి 10 మందిలో నలుగురు బాధితులు
- కన్న బిడ్డలకూ చెప్పుకోలేని దుస్థితి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సగటు మనిషి ఆయుర్దాయం నూరేళ్లుగా లెక్క కడుతూంటారు. ఇందులో సగం అంటే 50 ఏళ్లు వచ్చేసరికి సాధారణంగా అనారోగ్య సమస్యలు చుట్టుముడుతూంటాయి. అలా వచ్చే కొన్ని సమస్యలను కంటికి రెప్పలా చూసుకునే కన్న పిల్లలకు కూడా చెప్పుకోలేక కొంతమంది లోలోపలే కుమిలిపోతున్నారు. ముఖ్యంగా 50 ఏళ్లు దాటిన 60 నుంచి 70 శాతం మందిలో హఠాత్తుగా చుక్కలు చుక్కలుగా యూరిన్ (మూత్రం) రావడం సమస్యగా ఉంటోంది. దీనిని వైద్య పరిభాషలో 'స్ట్రెస్ ఇన్‌కంటినెన్స్' అని పిలుస్తుంటారు. దీనికి వయోభారంతో వచ్చే కండరాల బలహీనత ప్రధాన కారణమని యూరాలజీ నిపుణులు చెబుతున్నారు. 50 ఏళ్ల వయస్సు పైబడిన ప్రతి 10 మందిలో ఒకప్పుడు ఇద్దరు, ముగ్గురు ఈ సమస్యతో బాధ పడేవారని, ఇప్పుడు ఆ సంఖ్య ఐదు నుంచి ఆరు ఉంటోందని యూరాలజీ వైద్యులు అంటున్నారు. కొంతమంది ఈ సమస్యను ఎవ్వరికీ చెప్పలేక.. ముందు జాగ్రత్తలు తీసుకోలేక కేన్సర్ బారిన పడుతూ ప్రాణాల మీదకే తెచ్చుకుంటున్నారని అంటున్నారు.

మహిళల్లో అధికం

స్ట్రెస్ ఇన్‌కంటినెన్స్ పురుషుల్లో కంటే నాలుగు పదులు దాటిన మహిళల్లో ఎక్కువని ఇటీవల ఒక అధ్యయనంలో తేలింది. పెల్విక్ కండరాల బలహీనత, ఈస్ట్రోజన్ హార్మోన్ లోపాలు లైంగిక సామర్థ్యాన్ని దెబ్బ తీసి కాపురాల్లో చిచ్చుపెడుతున్నాయి. అసాధారణ పరిస్థితుల్లో మూడు పదుల వయసు దాటిన వారిని కూడా ఈ సమస్య వెంటాడుతోంది. రుతుస్రావం నిలిచిపోయే పరిస్థితిలో ఏర్పడే పోస్ట్ మెనోపాజల్ దశలో స్ట్రెస్ ఇన్‌కంటినెన్స్, వెజైనల్ డ్రైనెస్ సమస్యలు మొదలవుతాయి. అధిక కాన్పులు, శస్త్రచికిత్సలు, ప్రొస్టేట్ చికిత్స మహిళల్లో మూత్రం చుక్కలు చుక్కలుగా రావడానికి కారణమవుతున్నాయి. పురుషుల్లో మధుమేహం, శస్త్రచికిత్సలతోనే ఈ పరిస్థితి ఏర్పడుతోంది. తుమ్మినా, దగ్గినా తెలియకుండానే మూత్రం పడటం, వెజైనల్ సమస్యలు దీని లక్షణాలుగా చెబుతున్నారు.



కాకినాడ జీజీహెచ్‌లో యూరినల్ సమస్యకు చికిత్స పొందుతున్న బాధితులు

మూత్రం చుక్కచుక్కలుగా పడుతున్న వారికి కాకినాడ జీజీహెచ్‌లో యూరాలజీ, వెజైనల్ డ్రైనెస్ సమస్యకు గైనకాలజీ ఓపీల్లో సేవలందిస్తున్నారు. గడచిన ఆరు నెలల వ్యవధిలో ఈ రెండు విభాగాల ఓపీకి ప్రతి నెలా వస్తున్న కేసులను పరిశీలిస్తే రోగుల సంఖ్య పెరుగుతున్నట్టు స్పష్టమవుతోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం వంటి ప్రాంతాల్లో కూడా యూరాలజీ వైద్యుల వద్ద అవుట్ పేషెంట్లు, ఇన్‌పేషెంట్ల సంఖ్య పెరుగుతోంది. ఈ సమస్య పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉందని వైద్యులు చెబుతున్నారు. స్ట్రెస్ ఇన్‌కంటినెన్స్, వెజైనల్ డ్రైనెస్‌కు అధునాతన వైద్య సదుపాయాన్ని రాష్ట్రంలోనే తొలిసారిగా కాకినాడలో అందుబాటులోకి తీసుకువచ్చామని స్థానిక సృజనా ఆస్పత్రి కాస్మెటిక్ గైనకాలజిస్టు డాక్టర్ ఏఎల్ సత్యవతి చెప్పారు. ముంబైకి చెందిన ప్రముఖ ప్రసూతి వైద్య నిపుణురాలు సీజెల్ అజ్మీరా భాగస్వామ్యంతో ఈ సేవలు తీసుకువచ్చారు.

కాకినాడ జీజీహెచ్‌లో నమోదైన స్ట్రెస్ ఇన్‌కంటినెన్స్ బాధితులు

జనవరి	117
ఫిబ్రవరి	181
మార్చి	127
ఏప్రిల్	189
మే	201
జూన్	244



స్ట్రెస్ ఇన్‌కంటినెన్స్ చికిత్సకు ఉపయోగించే అధునాతన బీటీఎస్ ఎంసెల్లా చైర్

మానసిక సమస్యలు ఉత్పన్నం


స్ట్రెస్ ఇన్‌కంటినెన్స్ సహా, పెల్విక్ కండరాల బలహీనత, ఈస్ట్రోజన్ అసమతుల్యతలు మానసిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతాయి. మహిళలు సంసార, సాధారణ జీవితాల్లో ఇబ్బందులు పడుతున్నారు. చెప్పుకోలేని వేదనతో సతమతమవుతూంటారు. తొలి దశలో నిర్వహించే కౌన్సెలింగ్‌లోనే ఈ సమస్యలను ధైర్యంగా వైద్య నిపుణుల వద్ద ప్రస్తావిస్తే తక్షణ పరిష్కారం ఉంటుంది.

– డాక్టర్ వానపల్లి వరప్రసాద్, మానసిక వైద్య నిపుణుడు, జీజీహెచ్, కాకినాడ

మందులు లేకుండానే చికిత్స


అవాంఛిత మూత్రం కేసులు పెరుగుతున్నాయి. స్ట్రెస్ ఇన్‌కంటినెన్స్ సమస్యకు చెమట పట్టని వ్యాయామాలతో పెల్విక్ కండరాల పటిష్టత ద్వారా మందుల అవసరం లేని పరిష్కారం లభిస్తోంది. దీనికి అధునాతన బీటీఎస్ ఎంసెల్లా చైర్‌ను వినియోగిస్తాం. 28 నిమిషాల వ్యవధిలో 11 వేల పెల్విక్ వ్యాయామాలు చేయించడం ఈ యంత్రం ప్రత్యేకత. వీటిని కిగెల్స్ ఎక్సర్‌సైజ్‌లు అంటారు. వెజైనల్ డ్రైనెస్ నివారణకు వెజైనల్ రెజువనేషన్‌ను కూడా అందుబాటులోకి తెచ్చాం. కుర్చీలో కూర్చోవడం ద్వారా నొప్పి లేని చికిత్స అందిస్తాం.

– డాక్టర్ ఏఎల్ సత్యవతి, కాస్మెటిక్ గైనకాలజీ నిపుణురాలు, కాకినాడ

అందుబాటులో వైద్యం


మూత్రం లీకేజీ, వెజైనల్ డ్రైనెస్‌లు నానాటికీ అధికమవుతున్న సమస్యలు. ముఖ్యంగా పోస్ట్ మెనోపాజ్ దశలో ఉన్న మహిళల్లో ఈ సమస్య ఎక్కువ. తగ్గుతుందిలే అన్న ధీమా ఎంత మాత్రం సరికాదు. దీనివలన సమస్య తగ్గదు సరికదా, మానసిక సమస్యలు ఎక్కువై మానవ సంబంధాలు దెబ్బతింటాయి. తక్షణమే వైద్యులను సంప్రదించి వైద్యం పొందాలి. ఈ ఇబ్బందిని చెప్పుకొనేందుకు మహిళలు ముందుకు రాకపోవడమే అసలు సమస్య. అధునాతన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.

– డాక్టర్ మణికంఠన్ జింద్యం, అసిస్టెంట్ ప్రొఫెసర్, రంగరాయ వైద్య కళాశాల, కాకినాడ

నేడు స్పందన
కాకినాడ సిటీ: జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నారు. కలెక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. అలాగే డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం మంగళవారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. ప్రజలు తమ సమస్యలను 1800 425 3077 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని తెలిపారు.

రేపు జాబ్ మేళా
బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా ఉపాధి కార్యాలయంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి జి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఎస్‌బీ, తోషిబా, కాలీబ్‌హెచ్ వంటి కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయని వివరించారు. ఐటీఐ, డిగ్రీ లేదా ఎంబీఏ ఉత్తీర్ణులైన వారు దీనికి హాజరు కావచ్చన్నారు. వివరాలకు 0884 – 2373270 నంబరులో సంప్రదించాలని సూచించారు.

కిక్కిరిసిన అయినవిల్లి


అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామి మేలుకొలుపు సేవ, అనంతరం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించి, ప్రత్యేక, గరిక పూజలు చేశారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమంలో భక్త దంపతులు పాల్గొన్నారు. పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 57 మంది, లక్ష్మీగణపతి హోమంలో 16 మంది చొప్పున భక్త దంపతులు పాల్గొన్నారు. స్వామివారి 361 మంది భక్తులు ప్రత్యేక దర్శనం చేశారు. ఏడుగురు చిన్నారులకు నామకరణం, అక్షరాభ్యాసం, అన్నప్రాశన, తులాభారం వంటివి నిర్వహించారు. స్వామివారికి ఐదుగురు తలనీలాలు సమర్పించారు. 34 మంది నూతన వాహన పూజ నిర్వహించారు. వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా స్వామివారికి రూ.1,35,337 ఆదాయం లభించిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

ఓటు.. భవితకు రూటు

- 21 నుంచి ఓటరు సవరణ-2024
- వచ్చే నెల 21 వరకూ గడువు
- మార్పులు, చేర్పులకు అవకాశం

కాకినాడ సిటీ: వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం సమాయత్తమవుతోంది. ఈ మేరకు ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం - 2024కు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కొత్త ఓటర్ల నమోదు, పాత ఓటర్ల జాబితాలో తప్పొప్పులను సరిదిద్దుకోవడానికి అవకాశం కల్పించింది. ఇందుకోసం ఈ నెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకూ బీఎల్‌ఓలు ఇంటింటా తిరగనున్నారు. పద్దెనిమిదేళ్లు నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేస్తారు. చనిపోయిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగిస్తారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారికి వారి అభీష్టం మేరకు ఎక్కడ ఓటు ఉండాలో నిర్ణయం తీసుకుంటారు. ఓటర్ల జాబితాలోని పేర్లపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే బూత్ స్థాయిలో విచారణ చేపడతారు. సరైన ఆధారాలు చూపిస్తే తొలగించేందుకు చర్యలు తీసుకుంటారు. నియోజకవర్గం, పేర్లు, చిరునామాలు, ఫోన్ నంబర్లు, ఫొటో గుర్తింపు కార్డుల్లో అవసరమైన మార్పులు, చేర్పులు, తప్పొప్పుల సవరణలు చేస్తారు.

అక్టోబర్ 17న ముసాయిదా జాబితా

మార్పులు, చేర్పుల అనంతరం అక్టోబర్ 17వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. దీనిపై అభ్యంతరాల పరిశీలన పూర్తి చేసి, 2024 జనవరి 5వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారు. అక్టోబర్ 28, 29, నవంబర్ 18, 19 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆ తేదీల్లో జిల్లాలోని 1,634 పోలింగ్ బూత్‌ల్లో అధికారులు అందుబాటులో ఉండి, ఓటర్ల నుంచి అభ్యంతరాలు, క్లెయిములు, మార్పులు, చేర్పులపై అభ్యర్థనలు స్వీకరిస్తారు.

మూడు నెలలకోసారి..

పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం ఓటు హక్కు కల్పించింది. గతంలో ఏటా జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారినే ఓటర్ల జాబితాలో చేర్చేవారు. ప్రస్తుతం పద్దెనిమిదేళ్లు ఎప్పుడు నిండితే అప్పుడే ఓటర్ల జాబితాలో పేరు చేర్చుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఏటా నాలుగుసార్లు అంటే ప్రతి మూడు నెలలకోసారి కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించింది. జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో పద్దెనిమిదేళ్లు నిండిన వారు ఓటు హక్కు పొందవచ్చు.



2023 సవరణ జాబితా ప్రకారం జిల్లాలో ఓటర్ల వివరాలు

పురుషులు	7,90,538
మహిళలు	8,08,148
థర్డ్ జెండర్	240
మొత్తం	15,98,926

పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య 17,610 అధికం.

దరఖాస్తులు ఎక్కడ ఇవ్వాలంటే..

ప్రతి పోలింగ్ బూత్‌లో అధికారులు నిర్దేశిత తేదీల్లో ప్రజలకు అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరిస్తారు. అంతే కాకుండా ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో లేదా బూత్ లెవెల్ ఆఫీసర్లకు దరఖాస్తులు సమర్పించవచ్చు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌వీఎస్‌పీ.ఇన్ లేదా ఓటరు హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా స్వయంగా దరఖాస్తు చేయవచ్చు.

ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి


పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి. ఎన్నికల్లో యువతీ యువకులు పాల్గొని ఉత్తమ పాలకులను ఎన్నుకోవాలి. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ-2024 కార్యక్రమంలో భాగంగా బీఎల్‌ఓలు ఇంటింటా తిరిగి ఓటరు జాబితాపై పరిశీలన చేస్తారు.

– డాక్టర్ కృతికా శుక్లా, జిల్లా కలెక్టర్

పాఠ్య పుస్తకాలొచ్చేశాయ్

- సెమిస్టర్-2కు పంపిణీ లక్ష్యం 10.66 లక్షలు
- 22న విద్యార్థులకు అందజేసేందుకు చర్యలు

రాయవరం: విద్యా సంవత్సరం ప్రారంభంలోనే మొదటి సెమిస్టర్ పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం అందజేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ పాఠశాలల్లోని 1 – 10 తరగతుల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, 1 – 5 తరగతుల వారికి పాఠ్య పుస్తకాలతో పాటుగా వర్క్‌బుక్స్ అందజేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలలకూ 26,27,332 పాఠ్య పుస్తకాలు, 5,46,392 వర్క్‌బుక్స్ నూరు శాతం అందజేశారు. ఇంకా సమయం ఉన్నప్పటికీ రెండో సెమిస్టర్ పాఠ్య పుస్తకాలను కూడా ఈ నెలలోనే అందించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లూ చేసింది.

విద్యార్థులపై భారం తగ్గించాలనే..

గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వం మూడు సెమిస్టర్ల పాఠ్య పుస్తకాలు అందజేయగా, ఈసారి పాఠ్య పుస్తకాల్లో మార్పులు చేపట్టింది. 1 – 9 తరగతుల వరకూ రెండు సెమిస్టర్లను అమలు చేస్తోంది. దీని వలన టైటిల్స్ సంఖ్య కూడా తగ్గింది. ప్రస్తుతం 1 – 10 తరగతులకు లాంగ్వేజ్, నాన్ లాంగ్వేజ్ కలిపి 113 టైటిల్స్ ముద్రించారు.

22న విద్యార్థులందరికీ ఒకేసారి

సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలను ఈ నెల 22న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఒకేసారి ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పుస్తక గోదాముకు పాఠ్య పుస్తకాలు పూర్తి స్థాయిలో చేరుకున్నాయి. వాటిని మండల కేంద్రాలకు పంపిణీ చేస్తున్నారు. అక్కడి నుంచి పాఠశాలలకు పంపిణీ చేయనున్నారు.

అమెజాన్ ద్వారా నేరుగా..

ఇప్పటి వరకూ పాఠ్య పుస్తకాలను పుస్తక గోదాం నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా పంపిణీ చేస్తున్నారు. మొదటి సెమిస్టర్ పాఠ్య పుస్తకాలను కూడా ఇలాగే సరఫరా చేశారు. సెకండ్ సెమిస్టర్ పాఠ్య పుస్తకాలను ఆయా పాఠశాలలకు ఇండెంట్ వారీగా ప్రయోగాత్మకంగా అమెజాన్ ద్వారా పార్సిల్స్ రూపంలో పంపిణీ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 100 పాఠశాలలకు అమెజాన్ ద్వారా పాఠ్య పుస్తకాలు సరఫరా చేశారు. మిగిలిన పాఠ్య పుస్తకాలను ఎండీయూ వాహనాల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 85 శాతం పుస్తకాలు చేరినట్టు పాఠ్య పుస్తక విభాగం జిల్లా మేనేజర్ సురేష్ తెలిపారు. సెకండ్ సెమిస్టర్ పాఠ్య పుస్తకాలను అనుకున్న సమయం కంటే ముందుగానే సరఫరా చేస్తున్నామని పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జి.నాగమణి తెలిపారు.



సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలు

సెకండ్ సెమిస్టర్ పాఠ్య పుస్తకాలు జిల్లాల వారీగా..

జిల్లా	ఇండెంట్
తూర్పు గోదావరి	1,96,515
కాకినాడ	4,21,149
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	3,02,351

లోవ.. భక్తజన వెల్లువ



వసతి గదులు లేక చెట్ల కింద వంటలు, భోజనాలు చేస్తున్న భక్తులు

- లక్ష మందికి పైగా భక్తుల రాక
- రూ.16 లక్షల ఆదాయం
- గంటల తరబడి స్తంభించిన ట్రాఫిక్

తుని రూరల్: భక్తవరదాయినిగా పేరొందిన తలుపులమ్మ అమ్మవారు కొలువుదీరిన లోవ దేవస్థానం ఆదివారం భక్తజన సంద్రమే అయ్యింది. ఆషాఢ మాసం ఆఖరి ఆదివారం కావడంతో అమ్మవారిని దర్శించేందుకు దాదాపు లక్ష మందికి పైగా తరలి వచ్చారు. వీరిలో క్యూలో 70 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారని కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. వివిధ జిల్లాలకు చెందిన భక్తులు తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ ప్రత్యేక వాహనాల్లో వస్తూనే ఉన్నారు. విపరీతమైన రద్దీతో తాళ్లూరు జంక్షన్ నుంచి లోవ టోల్ గేటు వరకూ మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, తిరిగి మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో వేలాదిగా భక్తులు వాహనాలు దిగి కాలినడకన లోవకు చేరుకున్నారు. క్యూలన్నీ కిక్కిరిసిపోయాయి. ప్రత్యేక దర్శనానికి గంట, ఉచిత దర్శనాలకు రెండు గంటల పాటు భక్తులు క్యూలో వేచి ఉండాల్సి వచ్చింది.

మధ్యలోనే వెనుతిరిగిన భక్తులు

దర్శనాలకు ఆలస్యమవుతూండటంతో వేలాదిగా భక్తులు లోవ ప్రాంగణంలో కనిపించిన ప్రతి చెట్టుకూ పసుపు, కుంకుమ, నైవేద్యాలు పెట్టి, అమ్మవారిని దర్శించకుండానే వెనుతిరిగారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల కౌంటర్ల వద్ద బారులు తీరారు. దేవస్థానం పరిధిలోని వసతి గదులు నిండిపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వేలాది మంది భక్తులు లోవ ప్రాంగణంలో చెట్ల కింద, కొండ దిగువన ప్రైవేటు కాటేజీలు, అద్దె గదుల్లో వసతి ఏర్పాటు చేసుకుని వంటలు, భోజనాలు చేశారు. టోల్ గేటు నుంచి కొండ పైకి వెళ్లే మార్గంలో రూరల్ సీఐ సన్యాసిరావు, ఎస్సై విజయబాబు ఆధ్వర్యాన పోలీసులు బందోబస్తు నిర్వహించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. వాహనాలకు మూడుచోట్ల పార్కింగ్ స్థలాలు కేటాయించడం, రాజుపేట రోడ్డులోకి మళ్లించడం, నిర్మాణంలో ఉన్న రెండో ఘాట్ రోడ్డు నుంచి వాహనాలను కొండ దిగువకు పంపించడంతో ఘాట్ రోడ్లలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాలేదు. అమ్మవారిని విశేషంగా పూలతో అలంకరించారు. ప్రసాదాలు, పూజా టికెట్లు, వాహన పూజలు, కాటేజీ, వసతి గదుల అద్దెలు, విరాళాలుగా మొత్తం రూ.16,04,186 ఆదాయం లభించిందని ఈఓ తెలిపారు.



విశేషాలంకరణలో తలుపులమ్మ అమ్మవారు

నేటితో ముగియనున్న ఆషాఢ మాసోత్సవాలు

గత నెల 19న ప్రారంభమైన ఆషాఢ మాసోత్సవాలు సోమవారంతో ముగుస్తున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం ఘటాభిషేకానికి వేద పండితులు, ప్రధాన అర్చకులు ఆవాహన చేశారు. సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి సప్తనదీ జలాలతో అమ్మవారికి ఘటాభిషేకం నిర్వహించనున్నట్టు ఈఓ విశ్వనాథరాజు తెలిపారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


మృతుడు వంశీ (ఫైల్)

పెద్దాపురం: యువకుడు అనుమానస్పదంగా మృతి చెందిన ఘటన ఆదివారం పెద్దాపురం మండలం కట్టమూరు శివారు సూరంపాలెం పుంతక్వారీ గుంతలో చోటు చేసుకుంది. పెద్దాపురం ఎస్‌ఐ వెలుగుల సురేష్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కట్టమూరు గ్రామానికి చెందిన నడిపల్లి వంశీ (28) సూరంపాలెం క్వారీ గోతుల్లో విగతజీవిగా పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న సీఐ అబ్దుల్ నబీ, ఎస్‌ఐ సురేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతికి గల కారణాలపై ఆరా తీశారు. మృతికి కారణం కుటుంబ తగాదాలా, వ్యక్తిగత తగాదాలా అనే కోణంలో విచారణ మొదలు పెట్టారు. అనుమానాస్పద స్థితిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు వంశీకి భార్య అనూష, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గోదావరిలో వ్యక్తి గల్లంతు


గల్లంతైన శ్రీనివాస్ (ఫైల్)

కొవ్వూరు: రాజమహేంద్రవరం వాంబే కాలనీకి చెందిన కెల్లా శ్రీనివాస్ (38) ఆదివారం సాయంత్రం కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో స్నానఘట్టం వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగి గల్లంతయ్యారు. కొడుకు, మేనకోడలుతో నిడదవోలు కోట సత్తెమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లి తిరిగి వెళ్తూ కొవ్వూరులో గోష్పాదక్షేత్రానికి వచ్చారు. కొడుకు, మేనకోడలుకి నదిలో స్నానం చేయించారు. అనంతరం నదిలోకి దిగి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. నదిలో వరద ప్రవాహ వేగం పెరగడంతో ప్రవాహానికి కొట్టుకుని పోయారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో నదిలో గాలించినప్పటికీ ఎక్కడా ఆచూకీ లభ్యం కాలేదు. శ్రీనివాస్‌కి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారని పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు.

బైక్, వ్యాన్ ఢీకొని అక్కడికక్కడే..

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకినాడకు చెందిన బి.నాగ వెంకట గంగాధర్(27) దుర్మరణం పాలయ్యాడు. కోరంగి ఎస్సై పి.శ్రీనివాసకుమార్ తెలిపిన వివరాల మేరకు గంగాధర్, ఏడిద హర్షవర్ధన్‌లు బైక్‌పై వెళుతుండగా కోరంగి దుర్గామల్లేశ్వర ఆలయం ఎదురుగా వ్యాన్ ఢీకొనడంతో గంగాధర్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌ను నడుపుతున్న హర్షవర్ధన్‌కు తీవ్ర గాయాలు కాగా అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భావి పారిశ్రామికవేత్తల కోసం..

- 9వ తరగతి విద్యార్థులకు ప్రతి శుక్రవారం 'ఈఎండీపీ' అవగాహన
- ఉమ్మడి జిల్లాలో 710 మంది ఉపాధ్యాయులకు శిక్షణ
- 40వేల మంది విద్యార్థులకు ప్రయోజనం
- నేడు మాస్టర్ ట్రైనీలకు, 19, 20న ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ శిక్షణ


గతేడాది ఈఎండీపీ శిక్షణ పొందిన అనంతరం 9వ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టు (ఫైల్)

రాయవరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యలో విప్లవాత్మక మార్పులను తీసుకుని వస్తోంది. విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు గతేడాది నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు 'పారిశ్రామిక మనస్తత్వ అభివృద్ధి' అనే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతేడాది మంచి ఫలితాలు రావడంతో ఈ ఏడాది కూడా విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే పారిశ్రామిక మనస్తత్వ అభివృద్ధికి శిక్షణ ఇవ్వనున్నారు. విద్యార్థులను యువ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన శిక్షణ, 21వ శతాబ్దపు నైపుణ్యాలను వారికి అందివ్వనున్నారు. ఈ శిక్షణలో అస్లాటోన్, ఉద్యం, రీ బెనిఫిట్ అనే మూడు స్వచ్ఛంధ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యాన్ని పంచుకుంటున్నాయి.

తొలుత మాస్టర్ ట్రైనీలకు శిక్షణ

ఉమ్మడి జిల్లా పరిధిలోని తొమ్మితో తరగతి బోధించే 710 ఉపాధ్యాయులకు మాత్రమే శిక్షణ అందజేస్తున్నారు. ఉపాధ్యాయులకు శిక్షణ అందించేందుకు మాస్టర్ ట్రైనీలకు తొలుతగా శిక్షణ ఇస్తారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఏడుగురు మాస్టర్ ట్రైనీలకు సోమవారం మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు ఆన్‌లైన్‌లో వెబెక్స్ ద్వారా శిక్షణ ఇస్తారు. దీనికి సంబంధించిన వెబెక్స్ లింక్స్‌ను ఇప్పటికే మాస్టర్ ట్రైనీలుగా ఎంపికైన వారికి పంపించారు.

ఈ శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనీలు మండల స్థాయిలో 9వ తరగతి బోధన చేసే ఒక పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడికి ఈ నెల 19, 20 తేదీల్లో వెబెక్స్ ద్వారా ఆన్‌లైన్ శిక్షణనిస్తారు. అస్లాటోన్, ఉద్యం, రీ బెనిఫిట్ స్వచ్ఛంధ సంస్థలు జిల్లా రీసోర్స్ పర్సన్స్‌కు శిక్షణ ఇవ్వడంతో పాటుగా, బోధనకు అవసరమైన మెటీరియల్‌ను అందజేయనున్నాయి.

ఆత్మ విశ్వాసం పెంచేలా..

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని తొమ్మిదో తరగతి విద్యార్థులకు 'పారిశ్రామిక వ్యవస్థాపక మనస్తత్వ పెంపుదల'(ఈఎండీపీ)పై శిక్షణ ఇవ్వనున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో తొమ్మిదో తరగతి చదువుతున్న సుమారు 40వేల మంది విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది.

గతేడాది కాకినాడ జిల్లా నుంచి 15,174, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి 12,065, తూర్పుగోదావరి జిల్లా నుంచి 11,199 మంది విద్యార్థులు పారిశ్రామిక వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధిపై శిక్షణ పొందారు. ఈ విద్యార్థులకు కాకినాడ జిల్లా నుంచి 231, కోనసీమ జిల్లా నుంచి 269, తూర్పుగోదావరి 209 మంది ఉపాధ్యాయులు శిక్షణనిచ్చారు. వారంలో ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమంపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఇస్తారు. ఈ నెల 21 నుంచి విద్యార్థులకు శిక్షణ ప్రారంభమవుతుంది. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు పారిశ్రామిక రంగాల వైపు మళ్లేలా, వారిలో ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, నైపుణ్యాల అభివృద్ధిని పెంపుదల చేస్తారు. ఈ శిక్షణ ద్వారా భవిష్యత్తులో విద్యార్థులు వారి కాళ్లపై వారు నిలబడే అవకాశం కలుగుతుంది.

లక్ష్యాలు చేరుకునేందుకు



విద్యార్థి దశ నుంచే వారి భవిష్యత్తుపై ఆత్మవిశ్వాసం పెంచుకునేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహద పడుతుంది. చదువుకున్న అనంతరం ఉద్యోగం కోసం చూడకుండా, విద్యార్థులే పదిమందికి ఉద్యోగాలు కల్పించేలా చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ శిక్షణ ద్వారా కచ్చితంగా విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుంది.

– వై.నవ్య, జోనల్ మేనేజర్, ఈఎండీపీ, అమలాపురం

సద్వినియోగం చేసుకోవాలి



తొలుతగా ఉపాధ్యాయులకు ఇస్తున్న ఆన్‌లైన్ శిక్షణను సద్వినియోగం చేసుకుని, తిరిగి విద్యార్థులకు అందించాలి. విద్యార్థులను అన్ని రంగాల్లో శక్తిమంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ ముందుచూపునకు ఇది ఒక్క చక్కని ఉదాహరణ.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

మంచి నిర్ణయం



విద్య అంటే కేవలం ఉపాధికే కాకుండా.. మరింత మందికి ఉపాధి కల్పించేలా చేయడమే ఈఎండీపీ లక్ష్యం. విద్యార్థి దశ నుంచే పారిశ్రామిక వ్యవస్థాపక మనస్తత్వ పెంపుదలపై శిక్షణ ఇవ్వడం ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయంగా చెప్పవచ్చు.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

ఉరి వేసుకుని యువకుడి మృతి


వరప్రసాద్ (ఫైల్)

రాయవరం: కరప మండలం పేపకాయలపాలెంకు చెందిన పేపకాయల వరప్రసాద్(24) ఆదివారం రాయవరంలో ఉరివేసుకుని మృతి చెందాడు. అప్పుల బాధలు వరప్రసాద్ ఆత్మహత్యకు పురిగొల్పి ఉండవచ్చునని మృతుని బంధువుల ద్వారా తెలుస్తోంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వరప్రసాద్ ఈ నెల 14న స్థానికంగా పోలీస్ స్టేషన్‌కు సమీపంలోని లాడ్జిలో బస చేశాడు. శుక్రవారం మధ్యాహ్నం భోజనం చేసేందుకు బయటకు వచ్చిన వరప్రసాద్ తిరిగి బయటకు రాలేదు. ఆదివారం ఉదయం తలుపులు తీయకపోవడంతో లాడ్జి సిబ్బంది కిటికి తలుపు తెరిచి చూడగా మృతదేహం వేలాడుతూ కన్పించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం దుర్వాసన వస్తుండడాన్ని బట్టి శనివారం సాయంత్రం ఉరి వేసుకుని ఉండవచ్చునని స్థానికులు భావిస్తున్నారు. వరప్రసాద్ ఇంజినీరింగ్ చదివి కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. వారం రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చినట్లుగా కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది. 'నా అప్పులన్నీ ఓ సంవత్సరంలో తీర్చు దేవుడా..? అని మృతుడు రాసిన కాగితం ఆత్మహత్యకు పాల్పడిన గదిలో దొరికినట్లు తెలియడంతో ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యకు కారణంగా తెలుస్తోంది. మృతుడి తండ్రి నాగేశ్వరరావు ఏడాది క్రితమే చనిపోగా, సోదరుడు విశాఖపట్నంలోని ప్రైవేట్ ఫార్మా కంపెనీలో చిరుద్యోగిగా పనిచేస్తున్నట్లు తెలియవచ్చింది. తల్లి కాశీవిశాలాక్షి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ మాధవరెడ్డి అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడ్డొచ్చిన అత్తను చంపిన అల్లుడు


భార్య సింహాచలంతో నిందితుడు శ్రీను


స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్న కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి


తల్లిదండ్రుల కోసం బిక్కచూపులు చూస్తున్న నిందితుడి కుమార్తెలు


గాయపడ్డ సింహాచలంను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

- అనుమానంతో భార్యపై కత్తితో దాడి
- భర్త నిర్వాకంతో తీవ్ర గాయాలు
- కొత్తపల్లి మండలం నాగులాపల్లి శివారు ఉప్పరగూడెంలో ఘటన

పిఠాపురం: భార్యకు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో భర్త కత్తితో దాడి చేయగా అడ్డుకున్న అత్త మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలైన ఘటన కొత్తపల్లి మండలం నాగులాపల్లి శివారు ఉప్పరగూడెంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగికి చెందిన దంగ్రు శ్రీనుకు కొత్తపల్లి మండలం నాగులాపల్లి శివారు ఉప్పరగూడెంకు చెందిన దంగ్రు సింహాచలంతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ముగ్గురు ఆడపిల్లలు. మూడేళ్లుగా నిందితుడు శ్రీను భార్యపై అనుమానం పెంచుకున్నాడు. తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండేవి. దీంతో ఒమ్మంగి నుంచి ఉప్పరగూడెం వచ్చి అత్త గుర్రాల రాణి (55) ఇంటి వద్ద కాపురం పెట్టారు. అయినప్పటికి అనుమానంతో రోజూ భార్యతో గొడవ పడేవాడు. రెండు నెలల క్రితం ఉపాధి నిమిత్తం హైదరాబాద్ వెళ్లిన నిందితుడు ఇటీవల ఇంటికి వచ్చాడు. అప్పటి నుంచి భార్యను అనుమానిస్తూ వేధించాడు. ఈ నేపథ్యంలో గ్రామ పెద్దల వద్ద మాట్లాడినా ఉపయోగం లేకపోవడంతో రెండు పర్యాయాలు భార్య సింహాచలం కొత్తపల్లి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసులు ఇద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

అర్ధరాత్రి చాటుగా కాపలా

భార్యపై అనుమానంతో నిందితుడు బయటకు వెళుతున్నానని చెప్పి రాత్రుళ్లు తన ఇంటికి దగ్గర్లో మాటు వేసి కాపలా కాసేవాడు. ఇది చూసిన వారు ఎందుకు అలా చేస్తున్నావని అడిగితే సమాధానం చెప్పకుండా వెళ్లి పోయేవాడు. ఇంట్లో అందరూ నిద్ర పోయాకా పని ఉందంటూ బయటకు వెళ్లి ఇంటి దగ్గర్లో ఉన్న పాకలో దాక్కునే వాడు. ఎవరు రాక పోయినా వచ్చి ఎవరో వచ్చారు అంటూ భార్యతో గొడవకు దిగేవాడు.

అదను చూసి అంతమొందించాడు

చివరకు ఎలాగైనా భార్యను హతమార్చాలని నిర్ణయించుకున్న నిందితుడు శ్రీను వారం రోజుల క్రితం కత్తి తయారు చేయించి వెంట తెచ్చుకున్నాడు. అప్పటి నుంచి రాత్రుళ్లు కత్తి దగ్గర పెట్టుకుని పడుకునే వాడు. ఆదివారం ఉదయం అతని అత్త రాణి పక్క ఇంటి వారితో మాట్లాడుతూ తన అల్లుడు అనుమానంతో ఇబ్బంది పెడుతున్నాడని, చాలా ఇబ్బందిగా ఉందని చెప్పడం నిందితుడు శ్రీను విన్నాడు. ఇంటికి వచ్చిన వెంటనే తన భార్యపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇతరుల వద్ద తన పరువు తీస్తోందని భార్యపై కోపోద్రిక్తుడయ్యాడు. భార్యపై కత్తితో దాడికి దిగాడు. ఆమెను పరుగులు పెట్టించి కత్తితో నరికే ప్రయత్నం చేయగా ఆమె చెయ్యి తెగిపోయింది. ఇది చూసిన అత్త రాణి అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్ర గాయాలైన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. భార్యను చంపే ప్రయత్నం చేయగా ఇరుగు పొరుగు వారు నిందితుడిని పట్టుకునే ప్రయత్నం చేశారు. తన వద్ద ఉన్న కత్తిని చూపించి పట్టుకుంటే చంపేస్తానంటూ బెదిరించి అక్కడి నుంచి కత్తితో సహా నిందితుడు పరారయ్యాడు.

గాయపడ్డ భార్యను పిఠాపురం ఆసుపత్రికి ఆ తరువాత మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కి తరలించారు. కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబీకుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చేపట్టినట్టు వారు తెలిపారు. మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపల్లి ఎస్సై రామలింగేశ్వరరావు తెలిపారు. అమ్మమ్మను చంపి తండ్రి పరారవ్వగా తీవ్ర గాయాలతో తల్లి ఆస్పత్రి పాలవ్వడంతో వారి పిల్లలు రోదిస్తున్న తీరు చూపరులకు కంట తడి పెట్టించింది.

క్రీడలు దేశానికి వన్నె తెస్తాయి

ఘనంగా ప్రారంభమైన దక్షిణ భారత బిలియర్డ్స్, స్నూకర్ పోటీలు


స్నూకర్స్, బిలియర్డ్స్ పోటీలను ప్రారంభిస్తున్న కాస్మోపాలిటన్ క్లబ్ అధ్యక్షుడు రావు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): క్రీడాకారులు దేశానికి వన్నె తెచ్చే విధంగా కృషి చేస్తున్నారని కాస్మోపాలిటన్ క్లబ్ అధ్యక్షుడు ఎస్‌వీఎస్‌రావు అన్నారు. కాకినాడ టౌన్‌హాల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న దక్షిణ భారత బిలియర్డ్స్', స్నూకర్ చాంపియన్‌షిప్ 2023 పోటీలను టౌన్‌హాల్ కమిటీ చైర్మన్ నానాజీతో కలిసి ఆదివారం ఎస్‌వీఎస్ రావు ప్రారంభించారు. టౌన్‌హాల్‌లో రూ.10 లక్షల వ్యయంతో ఆధునీకరించిన స్నూకర్ బిలియర్డ్స్ నూతన ప్రాంగణాన్ని ఆయన ప్రారంభించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న క్రీడాకారులందరూ ఈ పోటీల్లో కాకినాడ రావడం గొప్పన్నారు. ఇటువంటి భారీ స్థాయి టోర్నమెంట్ నిర్వహణకు ఆతిథ్యమివ్వడం హర్షణీయమన్నారు. టౌన్‌హాల్ కమిటీ కార్యదర్శి పాబోలు చిన్న పున్నయ్య మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు నుంచి 150 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. భారతం లక్ష్మీపతి సోమయాజులు స్మారకార్థం ఈ టోర్నమెంట్ వారం రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులకు టౌన్‌హాల్, కాస్మోపాలిటన్ క్లబ్‌లో వసతి సదుపాయం కల్పించామన్నారు. టోర్నమెంట్ కమిటీ సభ్యులు డీవీఎన్ రాజు, హెచ్‌ఎస్ శర్మ, ఎస్.శ్రీనివాసరావు, సీహెచ్ లక్ష్మణకుమార్, వై.భాస్కర్, కె.గిరీష్, టోర్నమెంట్ కమిటీ కార్యదర్శులు కస్తూరి సోమేశ్వరరావు, జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమలాపురంలో సినీ సందడి


'అన్నపూర్ణ స్టూడియో' చిత్ర నటుడు సూర్యతో సందడి చేస్తున్న విద్యార్థులు

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన సినీ దర్శకుడు చెందు ముద్దు దర్శకత్వంలో రూపొందిన 'అన్నపూర్ణ స్టూడియో' చిత్రం ప్రమోషన్ ఫంక్షన్ స్థానిక ఏఎస్ఎన్ కళాశాలలో ఆదివారం జరిగింది. చిత్ర బృందం విద్యార్థులతో సందడి చేసింది. ఆ చిత్రంలో నటించిన నటుడు సూర్య మాట్లాడుతూ ఇటీవలే 'ఓ పిట్ట కథ' చిత్రాన్ని రూపొందించి హిట్ కొట్టిన దర్శకుడు చందు ముద్దు ఇప్పుడు రూపొందించిన అన్నపూర్ణ స్టూడియో చిత్రం కూడా అదే బాటలో విజయం సాధిస్తుందని ఆకాంక్షించారు. ఈ నెల 21న విడుదల కాబోతున్న ఈ చిత్రాన్ని అందరూ ఆదరించి ఆశీర్వదించాలని మరో నటుడు గనిశెట్టి రమణలాల్ కోరారు. నటుడు గుర్రం రామకృష్ణ, చిత్ర సంగీత దర్శకుడు మారుతి రాజా, అమలాపురం ఆకొండి సింహాచలం, సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ ఆకొండి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

21న 'ఒక్కడే వీరుడు' విడుదల


విలేకరులతో మాట్లాడుతున్న నిర్మాత సత్యనారాయణరాజు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు చరిత్రతో 'ఒక్కడే వీరుడు- అల్లూరి సీతారామరాజు' చిత్రాన్ని రూపొందించామని, ఆ చిత్రం ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ స్థాయిలో విడుదలవుతున్నదని చిత్ర నిర్మాత, జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక సభ్యులు రాజాసాగి సత్యనారాయణరాజు (కురుపల్లి బాబు) అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనగాదేవి మూవీస్ పేరున చిత్ర నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసి తొలిగా 'ఒక్కడే వీరుడు - అల్లూరి సీతారామరాజు' చిత్రాన్ని నిర్మించామన్నారు. జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు చరిత్రలో ఎన్నో కట్టు కథలు చోటు చేసుకున్నాయని, ఆ చరిత్రపై పూర్తిగా పరిశోధన జరగవలసి ఉందన్నారు. సీతారామరాజు 1899 నుంచి 1910 వరకు రాజమహేంద్రవరం పట్టణంలో నివాసం ఉన్నాడని, గోదావరి గట్టు ప్రాంతంలో ఉన్న ఉల్లితోట బంగారయ్య స్కూలులో ఒకటి నుంచి ఆరో తరగతి వరకు చదువుకున్నాడని, మల్లు దొర, శరభన్న పడాల్ రాజమండ్రి దేవిచౌక్ ప్రాంతాల్లో తిరిగారని, అయితే రాజమండ్రి చరిత్రలో వీటి ప్రస్తావన ఎక్కువగా వినిపించడం లేదని ఆయన ఆవేదన చెందారు. నిర్మాత రాజాసాగి సత్యనారాయణరాజు అల్లూరి జన్మించిన పాండ్రంగిలో జన్మించారని పడాల అన్నారు. చిత్ర పంపిణీదారులు రవి వర్మ, సత్యనారాయణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, అండమాన్ తదితర రాష్ట్రాల్లో... యూఎస్ఏలో...తూర్పుగోదావరి జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో 21వ తేదీన విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యంలో పోషక విలువలు


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ అరుణ్‌కుమార్


ఒక స్టాల్‌లో దోసెలు వేస్తున్న కలెక్టర్ మాధవీలత

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమీనర్ అరుణ్‌కుమార్

రాజానగరం: ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం (ఫోర్టిఫైడ్ రైస్)లో నాణ్యతతోపాటు ఎన్నో పోషక విలువలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో పీడీఎస్ బియ్యంతో ఆదివారం వంట పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ పీడీఎస్ బియ్యం విలువను గుర్తించలేక, కొంతమంది పక్కదారి పట్టిస్తున్నారని, తద్వారా ప్రభుత్వ ఆశయం పూర్తి స్థాయిలో నెరవేరకపోగా, కోట్లాది రూపాయలు వృథా అవుతున్నాయన్నారు. ఈ బియ్యం కోసం స్థానికంగా పండిస్తున్న రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి, మద్యస్థ సన్నబియ్యంగా ప్రభుత్వం అందిస్తోందన్నారు.

మహిళలలో రక్తహీనత ఎక్కువగాఉన్న రాష్ట్రాలలో మనది కూడా ఒకటి కావడంతో రక్తహీనతను నివారించేందుకు ఉపయోగపడే ఫోలిక్ యాసిడ్, బి 12 విటమిన్, ఐరన్‌లతో కూడిన బియ్యాన్ని కలిపి క్వాలిటీతో ఉన్న ఫోర్టిఫైడ్ రైస్‌గా అందిస్తున్నారనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. ప్రజలలో చైతన్యం తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలో రాజానగరంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టామని కమిషనర్ వివరించారు.

అబ్బుర పరచిన వంటకాలు

జిల్లా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ఆహార భద్రత పథకంలో భాగం పంపిణీ చేస్తున్న పీడీఎస్ బియ్యంతో అబ్బురపరచే రీతిలో సుమారు 40 రకాల వంటకాలు తయారుచేశారంటూ పోటీలలో పాల్గొన్న మహిళలను అభినందించారు. మునగాకుతో అన్నం, బియ్యంతో రవ్వను తయారు చేసి బెల్లం కలిపి రకరకాల వంటకాలు తయారు చేశారు. నేటి సమాజంలో పిల్లలు ఎక్కువగా కురుకురే వంటి వాటిని తింటున్నారు, అది ఆరోగ్యానికి అంత మంచిది కాదు, రేషన్ బియ్యంతో చిన్న చిన్న స్నాక్స్ తయారు చేస్తే మనమే వారికి మంచి ఆహారాన్ని అందించవచ్చన్నారు. అంతేకాక ఒక స్టాల్‌లో కలెక్టరు మాధవీలత స్వయంగా దోసెలు వేశారు. కమిషనర్ అరుణ్‌కుమార్ సతీసమేతంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.2,500 అందజేశారు. పోటీలలో పాల్గొన్న 50 స్టాల్స్‌కి చెందిన మహిళలకు ఒక్కో స్టాల్‌కి రూ. వెయ్యి చొప్పున రూ. 50 వేలను స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రోత్సాహక బహుమతులు సొంతంగా ప్రకటించి, అందజేశారు. జాయింట్ కలెక్టర్ ఎన్.తేజభరత్ మాట్లాడుతూ రేషన్ బియ్యం లబ్ధిదారులు, దుకాణాల నుంచి ఏ విధంగా దారి మళ్లుతుందో వివరించారు. దీనిని అరికట్టవలసిన బాధ్యత ప్రజలందరి పై ఉందనే విషయాన్ని గుర్తు చేశారు. రాజమహేంద్రవరం ఆర్డీఓ ఎ. చైత్ర వర్షిణి, డీఎస్ఓ ఇన్‌చార్జి విజయభాస్కర్, మార్కెటింగ్ డీఎం ఎ.కుమార్, తహసీల్దారు పవన్‌కుమార్, ఎంపీడీఓ బి.రామారావు, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, సర్పంచ్ కుందేటి ప్రసాద్, స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

హత్యాయత్నంపై కేసు నమోదు

గోకవరం: పిన్నిని చాకుతో పొడిచి హత్యయత్నానికి పాల్పడిన వ్యక్తిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎంవీఆర్ రెడ్డి తెలిపారు. కృష్ణునిపాలెం కొత్తూరు గ్రామానికి చెందిన చట్టాడి ఏసమ్మ ఇంట్లో ఆమె అక్క కుమారుడు తోకల గంగరాజు భార్య, పిల్లలతో నివాసం ఉంటున్నాడు. గంగరాజు రోజూ మద్యం తాగుతూ పనికి వెళ్లకుండా ఇంటిదగ్గరే ఉంటున్నాడు. దీంతో కుటుంబం పోషణ కోసం పనిలోకి వెళుతున్న అతని భార్యను వెళ్ల వద్దంటూ తరచూ గొడవ పడేవాడు. ఆదివారం గంగరాజు మద్యం తాగి తన భార్యతో గొడవ పడుతుంటే వారించటానికి వెళ్లిన ఏసమ్మను తన దగ్గర ఉన్న చాకుతో పొట్టపై పొడిచాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఏసమ్మను ఆసుపత్రిలో చేర్పించారు. బాధితురాలి కుమారుడు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గోదావరిలోకి దూకి యువతి గల్లంతు


గల్లంతైన కాంచన

యానాం: యానాం–ఎదుర్లంక బ్రిడ్జి పై నుంచి గౌతమీగోదావరిలో దూకి యువతి గల్లంతయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యానాం పట్టణ పరిధిలోని ఫెర్రీరోడ్డు సమీపంలో నివాసం ఉంటున్న మందింగి కాంచన(22) ఆదివారం రాత్రి యానాం–ఎదుర్లంక బాలయోగి వారధి 8వ పిల్లర్ వద్ద నుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. తండ్రి రమేష్ ఇదివరకే చనిపోయారు. తల్లి కమల ఉన్నారు. ఈ మేరకు యానాం పోలీస్‌స్టేషన్‌లో బంధువు సుబ్బయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఆమె దూకిన ప్రదేశం ఐ పోలవరం స్టేషన్ పరిధిలోకి వస్తుందని తెలిపారు. గల్లంతైన కాంచన ఆచూకీ కోసం బోట్ల సహాయంతో మత్స్యకారులు గాలిస్తున్నారు. ఆత్మహత్యయత్నానికి గల కారణాలు వెల్లడి కావాల్సివుందని పోలీసులు తెలిపారు.